క్లుప్తంగా

అలరించిన విద్యార్థినుల నృత్యాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు రోజున విద్యార్థినులకు నృత్య, వక్తృత్వ, వ్యర్థాలతో ఉపకరణాల తయారీ అంశాల్లో పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో పి.మృదుల, కె.భాను ప్రణీత, బి.శాంతిప్రియ వరుస మూడుస్థానాలు, వ్యర్థాలతో ఉపకరణాల తయారీ పోటీలో టి.మీనాక్షిత, వై.హేమశ్రీ ప్రథమ, వి.ఝాన్సీ, సీహెచ్ హేమ ద్వితీయ బహుమతులు సాధించారు. నృత్య పోటీల్లో వి.నిఖిత, ఎస్ నిహారిక, సీహెచ్ నవ్యశ్రీ బృందాలు వరుస మూడవ స్థానాల్లో నిలువగా కె.లాలస్య, బి.మౌనిక ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. విజేతలను కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ అభినందించారు.

మీడియాపై దాడికి ఖండన

ఏలూరు (టూటౌన్): హైదరాబాద్ టీవీ9 రంజిత్‌పై దాడిని ఖండిస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సినీ నటుడు, మాజీ ఎంపీ మోహన్‌బాబు ఇంటి వద్దవారి ఆయన కుటుంబ సమస్యకు సంబంధించి మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారని, ఈ నేపథ్యంలో రంజిత్‌ని తీవ్ర గాయాలు చేసిన మోహన్‌బాబుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ తరుపున తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

13న మహాసభల సావనీర్ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభల సావనీర్ ఆవిష్కరణ సభ ఈ నెల 13న సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేసినట్టు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరు నగరంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో వక్తలు చేసిన ఉపన్యాసాలు, నేడు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, వాటి మూలాలను వివరిస్తూ సావనీరు ప్రచురించినట్టు పేర్కొన్నారు. కొల్లేరు ప్రజల వేదిక కన్వీనర్ చింతపల్లి వెంకటనారాయణ సావనీరును ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్య వక్తగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఝాన్సీ, తదితరులు మాట్లాడుతారని, రైతులు కూలీలు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరు హామీల అమలు శూన్యం

- ఎక్కడి సమస్యలు అక్కడే
- లబ్ధిదారులకు అందని టిడ్కో ఇళ్లు
- కదలని భూగర్భ డ్రెయినేజీ అభివృద్ధి
- సర్వజన ఆసుపత్రిలో సౌకర్యాల కరువు
- పెరిగిన ధరలు.. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు



పోణంగి రోడ్డులో నిర్మాణ దశలోనే నిలిచిన టిడ్కో ఇళ్ల సముదాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా.. నేటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారా? వాటి ఫలాలు తమకు ఎప్పుడు అందుతాయా అని ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు, సూపర్ సిక్స్‌తో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికీ ఎమ్మెల్యే బడేటి చంటి ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించారు. గత ప్రభుత్వంపై విమర్శలు తప్ప, ఈ ఆరు నెలల కాలంలో స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చంటి తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి.

ఇళ్ల అప్పగింతలో జాప్యం

టీడీపీ హయాంలోనే ఏలూరు నగరంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, ఇళ్లను పేదలకు ఇచ్చేలోపే ఎన్నికలు వచ్చి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిందని, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తానని ఎమ్మెల్యే చంటి ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో అప్పట్లో గుర్తించిన 2208 మంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులంతా ఆయనకు ఓటు వేసి గెలిపించారు. ఆయన అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం ఎందుకని పేదలు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి టిడ్కో ఇళ్ల నిర్మాణం టీడీపీ హయాంలో 10 శాతం కూడా పూర్తికాలేదు. మోడల్ కోసం ఒక 20 ఇళ్లను నివాసయోగ్యంగా నిర్మించారు. ఒక బ్లాకుకు 48 ఇళ్ల చొప్పున 40 బ్లాకుల నిర్మాణాన్ని ప్రాంభించినా కొన్ని బ్లాకులు శంకుస్థాపన దశలోనూ, కొన్ని బ్లాకులు పిల్లర్ల దశలోనూ, మరికొన్ని బ్లాకులు శ్లాబుల దశలోనూ నిలిచిపోయాయి.

భూగర్భ డ్రెయినేజీ అభివృద్ధి మరిచారా?

ఏలూరు ఒన్ టౌన్ ప్రాంతంలో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. అప్పట్లో మట్టి గొట్టాలు ఏర్పాటు చేయడంతో కొంతకాలంగా అవి శిథిలదశకు చేరాయి. ఇటీవల డ్రెయినేజీ వ్యవస్థకు సంబంధించి కొన్నిచోట్ల మ్యాన్ హోల్స్ పాడైపోవడం, వాటి నుంచి మురుగు నీరు రోడ్లపై రావడంతో స్థానికులకు ఇబ్బందులు తలెత్తున్నాయి. దుర్గంధంతో అనారోగ్యంపాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో రూ.108 కోట్లు మంజూరు చేసింది. వీటిలో రూ.2 కోట్లు నుంచి రూ.3 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. భూగర్భ డ్రెయినేజీ అభివృద్ధి పనుల పూర్తికి ఎమ్మెల్యే చంటి ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు నిలదీస్తున్నారు.

అధోగతిలో సర్వజన ఆసుపత్రి

జిల్లా ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరులోని జిల్లా కేంద్ర ఆసుపత్రిని సర్వజన ఆసుపత్రిగా తీర్చిదిద్దారు. ఇందుకు అవసరమైన సౌకర్యాలు ఒక్కొక్కటిగా సమకూర్చుతూ వచ్చారు. ఏలూరుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకొచ్చారు. ఈలోపు ఎన్నికలు రావడంతో సర్వజన ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే చంటి ఇచ్చిన హామీ అమలుకాకపోగా, అసలు సౌకర్యాలే లేకుండా చేశారు. 78 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండాల్సిన ఈ అసుపత్రిలో ప్రస్తుతం అంతాకలిపి 35 మందే ఉన్నారు. సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌ల విభాగాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టడంతో వారు కొందరికే తీయడం తరువాత స్కానర్లు పనిచేయడం లేదని చెబుతున్నారు. దీంతో పేద రోగులు నష్టపోతున్నారు. ప్రధానంగా గుండె సంబంధిత స్పెషలిస్టుతోపాటు నెఫ్రాలజిస్టు, పల్మనాలజిస్టు, న్యూరో సర్జన్ వంటి స్పెషాలిటీ వైద్యులు లేక సర్వజన ఆసుపత్రి కునారిల్లుతోంది.

ధరల నియంత్రణేది

ప్రజలకు చంటి ఇచ్చిన మరో హామీ ధరల స్థిరీకరణ. ఈ ఆరు నెలల కాలంలోనే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు దాదాపు 50 శాతం నుంచి నూరు శాతం అదనంగా పెరిగాయి. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు తీవ్ర అసంతృప్తి ఎదురైంది. ధరలకు స్థిరీకరణ రాకపోగా నియంత్రణ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

సూపర్ సిక్స్ ఓ మోసం

సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడో స్థానిక ఎమ్మెల్యేకు కూడా స్పష్టత లేనట్టుందని ప్రజలు వ్యంగ్యాస్త్రాలు వదులుతున్నారు. అధికారం చేపట్టిన వెంటనే తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నుంచి అమ్మకు వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, 50 ఏళ్లు నిండిన వారికి రూ.1500, అలాగే 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.15 వేలు వంటి పథకాలను లాకర్లలో పెట్టి భద్రం చేశారా అంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. చంద్రబాబు చేతిలో మోసపోవడం తమకు పరిపాటిగా మారిందని వారు వాపోతున్నారు.

వైద్యులు లేరు



సర్వజన ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేదలు తమ అనారోగ్యానికి సంబంధించి పరీక్షల నిమిత్తం వస్తే సర్వజన ఆసుపత్రిలో సరైన వైద్యులు లేక, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక రోగం ముదిరి ప్రాణాలు కోల్పోతున్న హృదయ విదారక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే స్పెషలిస్ట్ వైద్యులను నియమించి పేదలకు వైద్య సేవలను అందుబాటులోకి తేవాలి. సిటీ, ఎంఆర్‌ఐ స్కాన్ వంటి ఖరీదైన పరీక్షలను పేదలకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలి.

– గొంతిన రామకృష్ణ, సోషల్ వర్కర్, ఏలూరు

14న మాల ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

ఏలూరు (టూటౌన్): విజయవాడలో ఈనెల 14న ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయం ప్రారంభిస్తున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు బేతాళ సుదర్శనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెండో మనవడు డాక్టర్ భీమారావు యశ్వంత్ అంబేడ్కర్, విశిష్ట అతిథిగా బీఎస్‌ఐ ఇంటర్నేషనల్ సెక్రటరీ కెప్టెన్ ప్రవీణ్ నికాడే పాల్గొంటారని పేర్కొన్నారు. ఈనెల 15న మాలల మహాగర్జన సందర్భంగా వాల్ పోస్టర్ విడుదల చేస్తారని తెలిపారు.

నేటి నుంచి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

ఏలూరు రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12, 13 తేదీల్లో కోటేశ్వరదుర్గాపురం, మాదేపల్లి, చాటపర్రు, ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక, మొండికోడు, పెదయాగనమిల్లి గ్రామాల సర్పంచ్, కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. రెండో విడతలో ఈ నెల 17, 18 తేదీల్లో చేపట్టే శిక్షణకు జాలిపూడి, కాట్లంపూడి, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, మల్కాపురం, శ్రీపర్రు, కలకుర్రు, కోమటిలంక సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 12న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్ నగర్, అమీనా పేట, కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, జిల్లా కోర్టు ప్రాంతం, ఫైర్ స్టేషన్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండ



వైఎస్సార్‌సీపీ అధినేతతో నేట్రు గణేష్ యాదవ్

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వ చర్యలపై కార్యకర్తలు అధైర్యపడొద్దని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు జంగారెడ్డిగూడెం పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు నేట్రు గణేష్‌యాదవ్ అన్నారు. బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గణేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారన్నారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జేపీ



పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తోందని, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై పోరుబాట పట్టేందుకు సన్నద్ధం అవుతున్నామని ఆ పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన నాయకులతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి అనేక హామీలు గుప్పించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేని స్థితిలో ఉందని జేపీ ఎద్దేవా చేశారు. ఈనెల 13న ఏలూరులో ప్రజల సమస్యలపై ఆందోళన చేస్తామన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులఅర్పించి, ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుంటామని, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని జేపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మేతర సురేష్‌బాబు, పల్లి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వద్దు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలతో ప్రజల జీవనాన్ని చిందరవందర చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏలూరు కార్యదర్శి బద్దా వెంకట్రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం న్యూ డెమోక్రసీ శ్రేణులు ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.18 వేల కోట్లు ప్రజలపై భారం వేశారని వివరించారు. విద్యుత్ చార్జీలు పెంచమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ తుంగలో తొక్కారన్నారు. గతంలో చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీలపై చేపట్టిన ఆందోళనలో పోలీసు కాల్పులకు ముగ్గురు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. నేడు మళ్లీ చంద్రబాబు ప్రజల వ్యతిరేక పాలన ప్రారంభిస్తున్నారని దుయ్యబట్టారు. చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని నగర కార్యదర్శి రాంబాబు అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. మంగం అప్పారావు, దుళ్ల వీరినాయుడు, రంగాల నూకరాజు, మీసాల వెంకటరమణ, కాకర్ల శ్రీను, కోరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు



జాలిపూడిలో ఫిర్యాదు అందిస్తున్న గ్రామస్తుడు

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు స్పందన కరువైంది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు తండోపతండాలుగా వస్తున్న ప్రజలు సదస్సుకు మాత్రం హాజరుకాలేదు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం ఇందుకు నిదర్శనమని పలువురు భావిస్తున్నారు. శనివారపుపేట ఒకటో సచివాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన సదస్సుకు ఎమ్మెల్యే బడేటి చంటి హాజరయ్యారు. పంటభూమి సర్వే చేయాలని ఇద్దరు, జాతీయ రహదారి ల్యాండ్ ఎగ్విజేషన్ పరిహారం అందలేదని ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసి, సంబంధిత అధికారుల ద్వారా నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తహశీల్దార్ జీవి శేషగిరిరావు తెలిపారు. జాలిపూడి సచివాలయంలో నిర్వహించిన సదస్సులో ఒక రైతు బ్యాంక్ అకౌంట్ సమస్య పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందించారు. సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకిరాణి, తహసీల్దార్ అంతర్వేది శ్రీనివాస్, సూపరింటెండెంట్ నాగమణి, వీఆర్వో తదితరులు సాయంత్రం వరకూ కూర్చుని వెళ్లిపోయారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



అంబర్‌పేట రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా

భీమడోలు: రైతులంతా పంటల బీమా ప్రీమియం తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా అన్నారు. అంబర్‌పేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో పంటల బీమా, దాళ్వా సాగులో మెలకువలు, సార్వా ధాన్యం సేకరణ, చెల్లింపులు తదితర అంశాలపై రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌కే హబీబ్ బాషా, ఏడీఏ పి.ఉషారాజకుమారి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డీఏవో మాట్లాడుతూ వరి పండించే రైతు ఎకరానికి రూ.500, మొక్కజొన్న రైతులు రూ.483 అపరాలకు రూ.60 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వరి రైతుల ఈనెల 30వ తేదీ నాటికి, మొక్కజొన్న, అపరాల రైతులు ఈనెల 15వ తేదీ నాటికి ప్రీమియం చెల్లించాలన్నారు. భీమడోలు మండలంలో సార్వా పంటకు సంబంధించి 19,784 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని, 2,294 మంది రైతుల ఖాతాల్లో రూ.41.19 కోట్ల నగదును జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, రైతులు ఏసురత్నం, ఆర్.శ్రీరామారావు, వీఏఏ టి.భారతి పాల్గొన్నారు.

14 వరకు ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈ నెల 11న ప్రారంభమైన ప్రత్యేక వైద్య శిబిరం 14 వరకు కొనసాగుతుందని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. శిబిరంలో అమెరికాకు చెందిన వైద్యులు శ్రీనాథ్ కామినేని రోగులకు సేవలందిస్తారని చెప్పారు. ముఖ్యంగా భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలు ఉన్న వారికి అత్యాధునిక వైద్య చికిత్స అందిస్తారన్నారు. వైద్య ఖర్చులు భరించలేని రోగులకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల సాయంతో చేయూత ఇస్తున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 83744 45108, 79016 95176 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదుపుతప్పి గోతిలో పడిన కారు

బుట్టాయగూడెం: కారు అదుపుతప్పి గోతిలోకి వెళ్లిన సంఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడేనికి చెందిన జల్లిపల్లి సత్యనారాయణ, తల్లి సత్యవతి, కొడుకు ఆనంద్ జంగారెడ్డిగూడెం నుంచి వారి స్వగ్రామానికి కారులో వెళుతుండగా మర్లగూడెం సమీపంలో కారు అదుపు తప్పి గోతిలోకి వెళ్లింది. ఈ సంఘటనలో వారి ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. తెలిసిన కొందరు వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమడోలు: జాతీయ రహదారి భీమడోలు కనకదుర్గ ఆలయం వద్ద వరి కోత యంత్రం మంగళవారం రాత్రి ఓ మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్లితే మన్యం జిల్లా నక్కపేటకు చెందిన గొర్లి రామకృష్ణ, కెంబూరి రామకృష్ణ ఓ బైక్‌పై భీమడోలులోని కెంబూరి రామకృష్ణ తన కుమార్తెను చేసేందుకు వస్తున్నారు. కనకదుర్గ ఆలయం వద్ద డివైడర్ దాటుతున్న క్రమంలో వరి కోత యంత్రాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంగా నడపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న గొర్ల రామకృష్ణకు తలకు బలమైన గాయాలు, కెంబూరి రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే చెట్ల నరికివేత

ఏలూరు (టూటౌన్): స్థానిక దొంగల మండపం వద్ద 20 ఏళ్ల వయసు గల రెండు చెట్లను వెంకటేశ్వర స్వామి గుడి ఈఓ ఉద్దేశపూర్వకంగానే నరికించారని సామాజిక కార్యకర్త ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ పేర్కొన్నారు. దీనిపై నవంబరు 11న పీజీఆర్ఎస్ ద్వారా అర్జీ దాఖలు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు చెట్లు నరికిన ప్రాంతాన్ని ఏలూరు కమిషనర్ పరిశీలించి చెట్లు రోడ్డుకు ఒక వైపుగా ఉండి, కొమ్మలు రోడ్డుపైకి వచ్చి పాదచారులకు, ఆ రోడ్డు వెంబడి వెళ్లే జనానికి ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెప్పినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయ ఈఓపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేనందున విషయాన్ని దేవదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎండార్స్‌మెంట్ ఇస్తూ చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు. కమిషనర్ సమాధానం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందని షరీఫ్ వాపోయారు.

రెవెన్యూ గ్రామ సభలను వినియోగించుకోండి

పెదపాడు: మండలం పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సభలను రైతులు వినియోగించుకోవాలని పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. ఈనెల 12న కలపర్రు, గోగులంపాడు, 13న వట్లూరు, 17న ముప్పర్రు పునుకొల్లు-2, పెదపాడు-2, రావులకుంట 19న పెదపాడు-2, పెదపాడు-1, పునుకొల్లు-1, 23న రాజుపేట, 26న సత్యవోలు, 27, 28 తేదీల్లో కొనికి, 30న అప్పనవీడు... అమృతలింగంపేట, 31 వసంతవాడ-2లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జనవరి 2న కొత్తూరు బూరాయిగూడెం, 4న తాళ్లగూడెం, ముప్పర్రు ఈదులకుంట, 6న వసంతవాడ-1, 7న నందికేశ్వరపురం, 8న సకలకొత్తపల్లి, గోగుంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	64
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	64
కాకర కాయలు	28-36	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	64	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	55	గోంగూర	07
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40